## చిట్టి కథ

# పాపం సుబ్రావ్

సుబ్రావ్ ఆఫీసులో కూర్చున్నాడన్న మాటేగాని, మనసంతా అదోలా వుంది, ఆలోచనా ప్రవాహంలో ఈదులాడుతున్నాడు. కడుపులో పేగులు రొద పెడుతున్నాయి. (నీ ఆలోచనలు తరువాత.... ముందు మా సంగతి చూడమని). క్రొత్తగా పెళ్ళయి, ముచ్చటగా కాపురం మొదలుపెట్టిన సుబ్రావ్‌కి అంతలేసి ఆలోచనలేమిటా....అని అనుమానం రావచ్చు. కాని కారణం తెలిస్తే అయ్యో....పాపం! అన్పించక మానదు. ఇంతకీ అతనిని వేధించే సమస్య........భార్యామణిగారి చేతివంట. కాపురం పెట్టిన మొదటి రెండ్రోజులూ అవీయివీ సర్దుకునే హడావుడిలో, హోటల్లో భోంచేసేశారు. అప్పుడు కాస్త కడుపునిండా ఏం తిన్నాడో....అంతే! ఆ తరువాత అంటే భార్యగారు వంట మొదలు పెట్టిన దగ్గర్నుండి, ఆవిడ చేతి అమృతం ఆస్వాదించలేక, క్రొత్తలోనే వంకలు పెట్టి, ఆవిడ మనసు నొప్పించలేక ఎంతో బాధపడుతున్నాడు.

అలా బోల్డంత సేపు ఆలోచించగా....చించగా... గొప్ప ఐడియా తట్టింది సుబ్రావ్ బుర్రకి. ఆహా! ఏమి నా తెలివితేటలు....ఈ దెబ్బతో మన కష్టాలన్నీ గట్టెక్కినట్టే అనుకుంటూ, హుషారుగా ఆఫీసు పని తెముల్చుకుని, సాయంత్రం అయిదు గంటలు కొట్టేసరికల్లా, బయటపడి, తిన్నగా ఓ పుస్తకాల షాపుకేసి దారి తీశాడు. వంటకి సంబంధించిన పుస్తకాలేవయినా వుంటే ఇమ్మన్నాడు. షాపువాడు అందుకే ఎదురు చూస్తున్నట్లు, టక్‌మని ఓ పుస్తకం తీసి, 'ఇది చాలా మంచి పుస్తకం సార్. కొత్తగా వచ్చింది. వెల కూడా సరసం' అంటూ ఓ పుస్తకాన్నిచ్చాడు. సుబ్రావ్ అది పాక్ చేయించి, డబ్బు చెల్లించి, ఇంటిదారి పట్టాడు.

మొన్నామధ్యనెప్పుడో ఓ ఫ్రెండ్ ఇంటికెళ్తే "వంటా-వార్పూ" అనే పుస్తకం కన్పించింది. అది గుర్తురాబట్టి ఇప్పుడు తన సమస్య పరిష్కారమయ్యింది అనుకుంటూ, తన తెలివినీ, జ్ఞాపకశక్తినీ అభినందించుకుంటూ, ఇంట్లో అడుగు పెట్టాడు.

'సుజా....ఓ సుజా....త్వరగా రా' అంటూ ఓ పొలికేకపెట్టాడు. వంటింట్లో వంకాయకూరతో కుస్తీపడుతున్న సుజాత గాభరాగా పరిగెత్తు కొచ్చింది. చేతులు వెనక్కి పెట్టుకొని, నేనేం తెచ్చానో చెప్పుకో – అంటున్న సుబ్రావ్‌ని మురిపెంగా చూస్తూ 'చీర... 'అంది. (అబ్బబ్బ, ఈ ఆడవాళ్ళకి చీరలూ, నగలూ తప్ప మరో ఆలోచన రాదుగదా, అని మనసులో అనుకొని, 'కాదు.'అన్నాడు. 'ఏంటబ్బా.'అని బుగ్గన వేలుంచుకొని, కాసేపు దీర్ఘాలోచనలోపడి, పొయ్యి మీద కూర మాడువాసన రావడంతో కంగారుగా వంటింటి వేపు వెళ్ళింది. ఏం తెచ్చారో అనే ఆశ నిలువనీయక, అది అలా దించిపెట్టేసి, మళ్ళీ వచ్చింది. సుబ్రావ్‌కి ఆ వాసనకి తల తిరిగినా, రేపటినుండి పుస్తకం వుందిగా....అని తన్నుతను ఓదార్చుకుని, 'ఇంకో ఛాన్స్' అన్నాడు. 'ఓడిపోయాను గానీ, త్వరగా చెప్పండీ....'అన్న సుజాత కనులముందు పాకెట్ వుంచాడు.

గబగబా విప్పి, పుస్తకం చూసిన సుజాత ఆశ్చర్యపోయి, 'అరే! ఈ పుస్తకమా? ఇది మీకెక్కడిది?'అంది. సుబ్రావ్ గర్వంగా నవ్వుతూ, 'షాపులో కొన్నాను. నువ్వు ఇకనుండీ ఈ పుస్తకం చూసి, వంట చెయ్యాలి'అన్నాడు.'కొనడమేమిటండీ ఖర్మ. అసలు పుస్తకం ఎవరు వ్రాశారూ. ఏమిటీ అని ఏమైనా చూశారా?' అంది. 'ఏం? మంచి పుస్తకం కాదా? నచ్చకపోతే ఇచ్చేసి ఇంకోటి తెస్తానులే' అన్నాడు.

'మహాశయా....ఒక్కసారి ఇటు చూడండి' అంటూ పేజీ తిరగేసి రచయిత్రి పేరు చూపించింది సుజాత. రచయిత్రి పేరు–కె. సుజాత. 'అంటే అంటే. ..'అన్నాడు గుటకలు మింగుతూ.

"ఆ సుజాతే – ఈ సుజాత. ఆ పుస్తకం పెళ్ళికాకముందు వ్రాశాను. పెళ్లి హడావుడిలో చెప్పడం మరిచాను. నా దగ్గర కూడా ·కాపీ లున్నాయి. వాటిలో వంటలే కదా రోజూ చేస్తున్నాను. మీరు చూసి తెచ్చారేమో అనుకుంటున్నానుస్మీ...''అంటూ వుపన్యాసం దంచుతున్నదల్లా, "హతోస్మి", అంటూ కుర్చీలో దబ్బుమని పడిపోయిన సుబ్రావ్‌ని చూసి, విషయం అర్థం కాక, నీళ్ళుతెచ్చి జల్లుదామని, వంటింట్లోకి పరిగెత్తింది శ్రీమతి సుజాతా సుబ్రావ్ "ది గ్రేట్ వంటల" రచయిత్రి.

—ఇంద్రాణి రత్నాకర్

